


# సంగమం

ఎ. సర్వేశ్వరరావు

ఎప్పుడూ మనుషులమధ్యే మసులుతుంటారు, బీదా గొప్పా తేడాలేక" అన్నది యమున.

"రాణీవారో!" అందుకుంది సరస్వతి. "వారూ అంతే. ఎక్కడే పెళ్ళి జరిగినా, వేడుక జరిగినా వారు రావలసిందేగా! వచ్చి దీవనలు, కానుకలు ఇవ్వవలసిందేగా!" అన్నది. "కాని వీరి కేమే, అంత ఘోషా?"

యమున మెల్లగా నవ్వింది. "ఘోషా కాదే. మరీ అందగాడయి ఉంటాడు. అందుకే అందరి దృష్టి పడితే దిష్టి తగులుతుందేమోనని భయం!" అన్నది.

ఫక్కున నవ్వింది గంగ. "అవును. నీ దృష్టి పడితే మరీ దిష్టి" అన్నది.

చెలులిద్దరూ నవ్వారు.

నవ్వు ఆగినతర్వాత, "ఘోషాయే కాదు— రహస్యం కూడాను" అన్నది సరస్వతి.

"రహస్యమా! అదేమిటి?" కుతూహలంగా అడిగింది యమున.

"అంటే ఏం లేదే. మా పాలేరు సుబ్బడు

## అమూల్య గ్రంథములు

| | |
|---|---|
| అబలా జీవితం | రు. 10—00 |
| గాంధీ జీవితం బొమ్మలతో | రు. 2—00 |
| నెహ్రూ జీవితం ,, | రు. 2—00 |
| డాక్టర్ రాజేంద్రప్రసాద్ జీవితం | రు. 2—00 |
| రాజరి రాధాకృష్ణన్ జీవితం | రు. 2—00 |
| ఆంధ్రుల చరిత్ర, సంస్కృతి | రు. 8—00 |
| వినువీధిలో వింతలు | రు. 6—50 |
| భాగవతం పద్యం పూర్తి 12సం. | రు. 19—00 |
| భారత ఆదిపంచకం వచనం | రు. 20—00 |
| గానకళాబోధిని | రు. 20—00 |

**బాలసరస్వతి బుక్ డిపో. మద్రాసు-1.**



**వేసవిలో దాహానికి ఆరోగ్యకరమైన చల్లని పానీయం!**

**AN ACE PRODUCT**

**డ్రింకాల్**

వాడండి!




**పలురకముల పళ్ళరసములతో తయారుచేయబడినది**

★

వివిధ రకముల పళ్ళ రసములతో తయారైన అన్నిరకముల పానీయములు కూడా లభించును.

తయారుచేయువారు:

**ఎంబ్రోసియా**

క్యానింగ్ ఎంటర్‌ప్రైసెస్.
పోష్టుబాక్సునెం 543 :: విజయవాడ-3

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
**వి. ఎల్. సౌత్ ఇండియా ట్రేడింగ్ కంపెనీ.**

(జె.బి. మంగారాం & కంపెనీకి డిస్ట్రిబ్యూటర్లు)
శివాలయం వీధి, విజయవాడ—1.

SUVARNA


# సంగమం

లేదూ—వాడి బంధు వొకడు జమీందారుగారి లోగిలిలో పని చేస్తున్నాడట. వాడిని వీరి గురించి అడిగితే—పేరూ ఎరగరట; తీరూ ఎరగరట. ఏదో జబ్బుతో ఉన్నారనీ, అందుకే పైకి రారనీ చెప్పాడు. అసలా గది విడిచే రారట. ఆఁ!'' అన్నది సరస్వతి.

''ఆఁ! అన్ని తెలుసుకుని మా కెప్పుడూ చెప్పలేదేమే?'' అన్నది యమున.

''చెప్పడాని కేముం దక్కా? మీకూ తెలుసనుకున్నాను'' అన్నది సరస్వతి.

''ఊహుఁ! జబ్బన్నది నిజమై ఉండదు, సరసూ! జబ్బయితే అంత ఇదిగా ఎలా పాడగలుగుతారు? ఊహుఁ! పైకి రాకపోవడానికి కారణం—అదో బిడియమై ఉంటుంది. అంతే!'' అన్నది గంగ.

'అతన్ని ఒక్కమారు చూడగలిగితే ఎంత బాగుణ్ణు!

'ఓ పుణ్యమూర్తీ! నీ రూపు నే నెరగను. కానీ నీ గానానికి ముగ్ధురాలినవుతూ నిన్ను కళ్ళారా చూడాలని అనుక్షణం పరితపిస్తూనే ఉన్నాను. ఈనాడు నా ఆశ ఫలించి, నీముందు మోకరిల్లి నిండు హృదయంతో ప్రణామాలర్పిస్తున్నాను. అందుకో. అందుకుని నన్ను ధన్యురాలిని చెయ్యి' అని కోరాలన్న భావం ఆ ముప్పురి హృదయాల లోనూ సంచలించింది.

* * * *

నిండు కుండలు మూడూ బావి అంచుమీద ఉన్నాయి. మగువలు ముప్పురూ తోటలో ఉన్నారు. అట గానం సాగుతూ ఉంది.

''ఊరెరుగను పేరెరుగను
ఎవరో నా హృది నిలచి కలచేను!''

'ఎరుగకపోతే ఎరిగే దారి నెరుగరాదో!' అనుకున్నది గంగ.

''చిత్రమే గీచినచో
రేఖ రేఖలో ఆ రూపె కనిపించేను!''

'నా హృదయాన నీ రూపమే చిత్రించబడి ఉంది, ప్రియా! అలాటప్పుడు నీ హృదయాన నా రూపుగాక మరేది చిత్రించబడుతుంది?' అనుకున్నది యమున.

''రచనయే చేసినచో, ప్రతి
వచనమున ఆ భావమే మెదిలేను!''

'నా సర్వస్వమూ నీ భావమే. మరి నీ మూగ భావం నేనుకాక మరెవరు?' అనుకున్నది సరస్వతి.

''పవనము మెల్లగా చల్లగా నను తాకగా
చెవిలో నెవరో పలికినటు లుండేను!''

చేతులతో తన రెండు చెవులు మూసుకుని పులకించిపోయింది యమున.

''ఏటిగట్టుపై నే నొంటిగా నిలచి ఉంటేను
నీట నెవరో కదిలి నగినట్టు లుండేను!
కలవరమంది, ఎవరని అడిగిన
తెలియదదహో! నేను నీ చెలినని!''

'ఏటివరకు వచ్చినవాడవు, మా వీటివరకు రాలేకపోతివో! వచ్చి చూడకపోతివో! అట నీ కెవరు స్వాగతమిత్తురో—అందుకొనకపోతివో వారిచ్చు ఆతిథ్యము! నీటిలో నీ చెలి నని పలికిన వారు నీ నీడలోనే నిలిచి నిను ఉంటారని ఎరుగక పోతివో!' అనుకున్నది గంగ ముగ్ధమోహనంగా.

''జంటగా సాగిపోదము రారమ్మనె
మింట తారల కలిసిపోదము రారమ్మనె!
మనిషి కనిపించకే మాట వినిపించేను!''

పాట ఆగిపోయింది. ప్రకృతి చిన్నవోయింది.

'మనిషి కనిపించకే పాట వినిపించును!' లోలోన తియ్యగా పాడుకుంది యమున.

''పాట వినిపిస్తూ, మనిషి కనిపిస్తే ఎంత గొప్పగా ఉంటుందని!'' అన్నది సరస్వతి.

''నిపిస్తే ఆ అందం తరగదో!'' అన్నది యమున.

'నా మనసున వెన్నెల విరియదో!' అనుకున్నది గంగ.

* * * *

ఆశగా, ఆత్రంగా చూస్తూ తోటలో నడయాడ సాగారు యువతులు. వేళ మీరుతున్నది. ఎంతసేపని ఉండగలరు! బావిచేరి గట్టున ఉన్న కడవలను భుజాల కెత్తుకుని, 'వెళ్ళిపోవడమేనా! ఇంతేనా?' అని మథన పడుతున్నంతలో—

''అదిగో, అటు చూడక్కా!'' అన్నది సరస్వతి, సౌధంకేసి చూపించి.

''ఆఁ!'' చూశారు వారిద్దరూ. వారి ముఖాలు వెన్నెలలోని కలువల్లా విరిశాయి.

తెరిచి ఉన్న ఓ కిటికీ. ఆ కిటికీవెనక ఓ తల కనిపిస్తున్నది. అదీ ముచ్చటైన ఉంగరాల తల.

''అతనే నంటావా?'' అన్నది యమున భుజంమీది కడవను గట్టుపై ఉంచుతూ.

''కావచ్చు'' అన్నది గంగ,తన కడవా ఆ పక్కన ఉంచి.

''అదిగో! మురళిని పెదవుల కందిస్తున్నాడు, చూడక్కా'' అన్నది సరస్వతి.

అతని ముఖం ఇటులేదు. మెడ పక్కగా, వాలుగా మురళి కనిపిస్తున్నది. అంటే అది పెదవులకు చేర్చబడుతున్నదని ఊహించింది సరస్వతి. ఆమె ఊహ కనుగుణంగా ఆ వెంటనే ఆలాపన ప్రారంభమైంది. పరవశులయ్యారు పడుచులు ముగ్గురూ. బావి గట్టుకు చేరబడిపోయి, ఒకరిపై నొకరు వాలి తన్మయంగా ఉండిపోయారు. మురళి ఆగింది. పాట సాగింది.

''గంగా.....'' తియ్యని ఆలాపన.

ఉలిక్కి పడింది గంగ. విస్మితులయ్యారు చెలులు. ''అదేమిటే, నిన్ను పిలుస్తున్నాడు?'' కలవరపడుతూ అన్నది యమున.

''ఆఁ!'' తత్తరపడి, ''ఊహుఁ! పిలుపు కాదే—పాట'' అన్నది గంగ సంభ్రమంగా అటు చూస్తూ.

''గంగాస్రవంతియై నీ రూపమూ...''

''పాట కాదు—పిలుపే'' అని చిలిపిగా మోచేతితో గంగను పొడిచింది యమున. గంగ హృదయం గంగాస్రవంతియై పొంగిపోయింది.

''యమునా.....'' ఉలికిపడటం ఇప్పుడు యమున వంతయింది.

''ఇప్పుడో!'' అని యమున బుగ్గపట్టి మెలిపెట్టింది గంగ.

''అబ్బ! ఉండవే!'' ప్రణయలహరుల పొంగి పరవళ్ళు తొక్కింది యమున హృదయం.

''యమునానదియై నీ మనసూ....''

సరస్వతి కిలకిలా నవ్వింది. కానీ, ఆమె వంతూ వచ్చింది.

''శారదాస్రవంతియై నీ ప్రేమా
సంగమ మయ్యేను నా అంతరంగమున
పొంగి పొరలే ప్రణయ తరంగముల!''

''అబ్బ! మనపైనే పాడాడే. ఎంత అదృష్టం!'' అన్నది సరస్వతి సంబరంతో.

''ఆఁ! అరె, చాలా వేళయిందే! పదండి పోదాం'' అని తత్తరపడింది యమున.

నిట్టూర్చింది గంగ.

కడవలు భుజాన పెట్టుకున్నారు. నడక సాగుతూఉంది.

పాట వినిపిస్తూనే ఉంది. ''గంగా....''

'పాట కాదది. పిలుపే. నా ప్రణయదేవుని వలపు పిలుపు!' అనుకున్నది గంగ.

'నా 'మనసే నీ భావము! ఎంత అదృష్టం!' మురిసిపోయింది యమున.

'నేనే నీ ప్రేమమయిని! అంత భాగ్యమా నాకు!' అనుకున్నది సరస్వతి.

కానీ, ఇన్ని అనుభూతులకు మూలమైన అతని మనసేమనుకుంటున్నది? ఎవరి నారాధిస్తున్నది? ఎవరికై పరితపిస్తూ, నిరీక్షిస్తున్నది?

* * * *

కిటికీ అలానే తెరుచుకుని ఉంది. కానీ, దాని వెనక ఏ తలా కనిపించడంలేదు నేడు. లోపలుండి మురళి మాత్రం వినిపిస్తూ ఉంది. అది విన్న ఈ ముగ్గురూ ఆనందపడటంలేదు ఈ రోజు. ఆ మూర్తికై ఎదురుచూస్తూన్నారు. ఆ శిరోదర్శనానికి లోలోనే పరితపిస్తున్నారు. కానీ, వారి ఆశ ఫలించలేదు. మురళి ఆగిపోయింది. చాలాసేపటి తర్వాత పాట వినిపించసాగింది. అదీ ప్రణయార్ద్రత విషాద గీతి.

''నా వలపు పిలుపు వినీ
నీవె రావలె నెచ్చెలీ!''

'నేనే రావలెనా! ఏలనో? ఎంత చమత్కారం!' తనలో తనే తియ్యగా నవ్వుకుంది గంగ.

''కదలలేను మెదలలేను
వ్యథల మాటున నలిగేను.''

'ఏమిటో ఆ వ్యథ?' అనుకున్నది యమున ఆసక్తిగా పాట వింటూ.

''నిను చూచిన గాని, ఓ చెలీ!
నను వీడగ బోదు ఈ వ్యథ
విధి దయ జూపగరాదు
హృదినిను మరువగ లేదు!''

'ఎంత నిర్దయ, విధికి!' అనుకున్నది సరస్వతి. 'ఎంత ప్రేమమయం, అతని హృదయం!' అన్న భావనతో రాగరంజితమైంది ఆ హృదయం.

''నా వేణునాదము ఆ దూర గిరుల దాకి
ఏవేవొ స్మృతుల ధ్వనియించేను.
ఆవేదనే గాని, ఆ ప్రేమయే గాని
నీ వీనుల సడి చేయలేదా?''

'ఎంత శక్తి, అతని వేణువుకు! అవును. హృదయసీమల జొచ్చి, ప్రేమలహరుల పొంగించి, ఆశల కలిగించి, అనుభూతులను లిఖించి కలచేది వంశీగానంకాక మరేమిటి?' అనుకున్నది గంగ.

''సడి చేసినా గడి వీడి రాలేక
జడమై, ఎడమై పోతివా. నెచ్చెలీ!''

'అవును. అంతే! పరిసరాల ప్రభావంమధ్య నేను జడురాలినే. నావారు నన్ను ఉంచిన గడి దాటి రాలేను. నీవె రావలె ప్రియతమా!' అనుకున్నది యమున. అయితే అలానే ఆ తక్కిన రెండు మనసులూ అనుకున్నాయని ఆమె కెలా తెలుస్తుంది?

మువ్వురి హృదయాలూ అజ్ఞాత ప్రేమతో, తీయని బాధతో నిండిపోయాయి. కానీ, ఆ పాటలోని వ్యథ చాటున ఉన్న గాథ సూచనగానైనా ఆ అమాయక హృదయాలకు తట్టలేదు. తట్టిననాడు ఆ అనుభూతు లే రూపు తాలుస్తాయి?

పాట ముగిసినంతలో తల కూడా ఆ కిటికీ వెనక ప్రత్యక్షమైంది. ఆత్రంగా, ఆశగా చూశారటు. కానీ, ఆ ముఖం ఇటు తిరగనే లేదు.

''ఒక్కమారు. ఒకే ఒక్కమారు. మెరుపు మెరిసినట్లుగా ఇటు తిరిగి చూడరాదో!'' అన్నది సరస్వతి. నిట్టూర్చారు గంగా యమునలు. తిరిగి చూడాలని వారికీ ఉంది. కానీ, వారి లాలస వారి మనసుల్లోనే ఉండిపోయింది. నివేదన నిగూఢంగా ఉండిపోయింది. అయితే ఈ విన్నపాలేవీ ఆ మూర్తికి వినిపించలేదా? వినే, విననట్లుగా ఉపేక్షాభావం ప్రకటిస్తున్నాడా? ఆ హృదయానికి ఇసుమంత కూడా దయలేదా? ప్రేమలేదా? ఆరాధన అక్కరలేదా?

మెలమెల్లగా ఆ తలకూడా దూరమైపోయింది. కాస్సేపటికి కిటికీ రెక్కలు కూడా మూసుకున్నాయి.

* * * *

నడిరేయి. అదీ పున్నమి రేయి. కన్నె మనసులను గిలిగింతలిడే వెన్నెల రేయి. ఆరుబయట అయిదవ మంచంమీద పవ్వళించి ఉంది గంగ. వెన్నెల్లోకి చూస్తున్న ఆమె నేత్రాలు నీలాల్లా మెరుస్తున్నాయి. మనసున ఏదో తీయని, తీరని అనుభూతుల ప్రకంపన.

''నా వలపు పిలుపు వినీ
నీవె రావలె, నెచ్చెలీ!'

ఏ చెట్టుకో చేరబడి కొమ్మలు కదిలిస్తూ, తీయగా, హాయిగా, బిగ్గరగా పాడుకోవా లనిపించింది. కానీ, పరిసరాలందుకు సమ్మతించవు. అది ఆమెకు తెలుసు. అందుకే తన అభిలాషనూ, ఆరాటాన్నీ అణుచుకుని, నిట్టూర్పుల్లో వేగి, నిరాశతో వీగి మథనపడుతూ ఉండిపోయింది. మనసు మాత్రం పాడుతూ ఉంది—

'ప్రియా! ఏనాడు నీ రాక?
ఏనాడు నా మది నుదయించు నెలరేఖ?'

అదే రేయి—డాబాపై తల్లి పక్కన పడుకుని ఉంది యమున. వెన్నెలలోకి చూస్తున్న ఆమె నేత్రాలు నీలాల్లా మెరుస్తున్నాయి. అంతరంగం, అందుకోలేని అనుభూతుల పరుగు తీస్తున్నది.



సరస్వతి (పశ్చిమ బెంగాల్)
ప్రతిచిత్రం—బి. వి. ఎస్. గుప్త (మదనపల్లె)

'ఊరెరుగను, పేరెరుగను.
ఎవరో! నా హృది నిలచి కలచేను!'

కొలను ఒడ్డున కూర్చుని నీటిలోకి చూస్తూ తన నీడతో కలిసి తీయగా, హాయిగా, బిగ్గరగా పాడుకోవా లనిపించింది. కానీ, పరిసరాలందుకు సమ్మతించవు. అది ఆమెకు తెలుసు. అందుకే తన అభిలాషనూ, ఆరాటాన్నీ అణుచుకుని నిట్టూర్పుల్లో వేగి, నిరాశతో వీగి మథనపడుతూ ఉండిపోయింది. మనసు మాత్రం పాడుతూనే ఉంది—

'కదలలేను మెదలలేను

వ్యథల మాటున నలిగేను!
నీవె రావలె, ప్రియతమా!'

ఇక్కడా అదే రేయి. పిల్లల మధ్య పడుకుని ఉంది సరస్వతి. కిటికీలోనుంచి దూసుకు వస్తున్న చంద్ర కిరణాలవంక చూస్తున్న ఆమె నేత్రాలు ఆపేక్షతో మెరుస్తున్నాయి. అర్థం కాని, జ్ఞాతం కాని మధురానుభూతులలో మనసు ఉక్కిరి బిక్కిరయిపోతున్నది.

'రాధా మాధవ జీవన లీల
బాధే భావన తెలియని వేళ....'

వీణ వాయిస్తూ తీయగా, హాయిగా, బిగ్గరగా పాడాలనిపించింది కానీ, పరిసరా లందుకు సమ్మతించవు. అందుకే లోలోనే పాడుకొంటూ ఉండిపోయింది, తపనతో.

'దారి తెలియదు
తీరు తెలియదు
నిను చేరు టెటులో?
నా పిపాస తీరు టెటులో!' మనో వీణ మోగుతూ ఉంది.

* * *

ప్రకృతి బెదిరిపోతున్నది. విన్నవారి వీను లదిరిపోతున్నాయి. గుండెలు కదిలిపోతున్నాయి. ఎన్నడూ లేనంత బిగ్గరగా, విషాదంగా పాడు తున్నాడు. ఆ పాటలోని భావం వెనక దాగిన వ్యథ ఏ ప్రకృతికీ అందడంలేదు.

"చెలియే ఇక అతి దూరమా?

## సంగమం

బ్రతుకే మోయరాని భారమా?"

కన్నెల మనసులు కలగిపోతున్నాయి. కనుల నశ్రువులు నిండి పొర్లిపోతున్నాయి.

"చెలువము చెడెనని నీ మనసు మారెనా
విలువలు మారెనని నీ మమత తీరెనా
ఇంతలో ఇంతగా మారిపోదువా
చింతలో నను వీడి దూరమౌదువా!"

అనూహ్య సంక్షోభంతో గంగ మనసు తల్లడిల్లిపోతున్నది.

యమున హృదయం కన్నీట వరద వారింది.

'భగవాన్! ఏమైం దతనికికి ఎందు కలా ఏడుస్తూ పాడుతున్నాడు?' క్షోభిల్లిపోతున్నది సరస్వతి.

"శిథిల మాయెనని ఈ తనువును చేర కుందువా
పదిలమై నది మనసు దానినైన చేరదీయవా
వ్యథలమాటున ప్రేమ దాచి
ఎదురు చూచితి నీకై ఇన్నాళ్ళు!"

ఎవరికై? ఎవరు వారు? ఎవరికా నిర్దయ? తెలియని వేదన, కలియని ఊహలు.

"గతమునె ఒక కలగా మరచిపోతివా
స్థితులకు వెరచి కథను మార్చుకొంటివా
ఇంతలో ఇంతగా......"

కన్నీట కడవలు నిండిపోతున్నాయి. లేత గుండెలు పగలనున్నాయి.

"ఇన్నాళ్ళ నిరీక్షణ ఈ ఒక్క మాటతో
కన్నీళ్ళకే మిగిలి బ్రతుకు బలి కావలెనా?"

"ఇక వినలేను, గంగా! ఇక వినలేను" అని కడవను పట్టి పరుగుతీసింది యమున. తక్కిన ఇద్దరూ అదే స్థితిలో ఉన్నారు. వారూ కడవ లను చేత గొని చెలిని అనుసరించారు.

* * *

"అంతిమ శ్వాసందు నీ ధ్యాస నిలచి
మృత్యు సముఖ మనుండి నే బిలచుచుంటి
చూడరావో, చెలీ! కడసారి నన్ను
శారదా స్రవంతి పులిన సీమలందు!"

త్రుళ్ళిపడి లేచింది గంగ. కళ్ళు తెరిచి భీతిగా చూసింది. అదే గీతం మళ్ళీ ఆమె వీనుల్లో ధ్వనించింది. పక్క నున్న మంచాలకేసి చూసింది. అంతా ఆదమరిచి నిద్రపోతున్నారు. 'నా ఒక్క దానికే వినిపిస్తున్నదా ఆ ఆవేదన? మరెవరికీ వినిపించనే లేదా?' అనుకున్నది. హృదయం విల విల్లాడిపోయింది. 'ఏమైంది, అతనికి? ఎందు కలా రోదిస్తున్నాడు? ప్రియతమా! ఏమైంది నీకు? నేనేం చేయగలను?' గబాలున పక్కమీద నుంచి లేచింది. పరుగుతీసింది. కానీ, ఆ పరుగు ప్రాంగణం దాటబోయేసరికి స్తంభించి నిలచి పోయింది. 'ఊహూఁ. నేను వెళ్ళలేను—వెళ్ళలేను'





ఆంధ్రప్రదేశ్‌కు సోల్ సెల్లింగ్ ఏజంట్లు:
మెస్సర్స్: సెంచరీ ట్రేడింగ్ కంపెనీ, కొటారు బిల్డింగ్, గాంధినగరం, విజయవాడ—3.

అని మూగగా రోదిస్తూ వెనక్కువచ్చి పక్కపై వాలిపోయింది గంగ.

"చూడరావో, చెలీ! కడసారి నన్ను!..." ఉలిక్కిపడి లేచింది యమున. పక్కనే పడుకున్న తల్లివంక భీతిగా చూసింది. శరవేగంతో గుండె స్పందిస్తున్నది. పదే పదే ఆ నివేదన వీనులలో రొద చేయసాగింది.

"పిలుచుచున్నది రమ్మని భగ్నప్రేమ
స్వాగతమ్మని పలికెను స్వర్గసీమ.
తరలి రమ్మని మృత్యువు తేరు నిలిపె
శారదా స్రవంతి పులిన సీమలందు!"

చుట్టూ చూసింది. ఎవరిలోనూ చలనం లేదు. హాయిగా నిద్రపోతున్నారు. 'ఎవరికీ వినిపించడంలేదా, ఆ రోదన? నా ఒక్కదానికే వినిపిస్తున్నదా?' అనుకున్నది. అర్థంకాని వేదనతో మనసు ఆతలాకుతలమైపోయింది. 'ఏమైందతనికి? ఎందుకలా విలపిస్తున్నాడు? ప్రియతమా! ఏమైంది నీకు? నీ యీ దుఃఖానికి కారకు లెవరవుతున్నారు? ఎవరో దూరమవుతున్నారని ఎందు కలా వ్యథ పడుతున్నావు? అందరినీ మించి నేను నీకు చేరువవుతాను.' గభాలున పక్కమీదనుంచి లేచింది. వడివడిని మెట్లు దిగబోయింది. కాని మరి మెట్టునే ఆ అడుగు లిక స్పృశించ లేకపోయాయి. 'నేను రాలేను. రాలేను, ప్రియతమా! నా చుట్టూ ఉన్న బంధనం, తెంచుకు రాలేనటువంటిది.' చేతుల్లో ముఖం కప్పుకుని మూగగా రోదిస్తూ కుప్ప కూలిపోయింది యమున.

"చూడ రావో, చెలీ! కడసారి నన్ను!"

భీయుని కల చెదిరిపోయింది. సర్వాంగాలూ భీతాహతమైనాయి ఒక్కసారి. కళ్ళు నులుముకుని చూసింది. సర్వం చీకటి. కాని ఆ చీకటిలోనుంచి దూసుకువస్తున్న ఆ నివేదన ఆమె గుండెలను పిండేసింది.

"ఆరిపోవుచున్నది తుది ఆశ కూడ
తిమిర మావరించెను నాదు దగ్ధ హృదిని
పోయెదో! చెలీ! కడకు నీ పిలుపు గొనక.
శారదా స్రవంతి పులిన సీమ విడచి!"

పరిసరాల నాస్తుతగా తిలకించింది. అందరూ ఒళ్ళు తెలియని నిద్రలో ఉన్నారు. 'ఎవరికీ వినిపించలేదా? నా ఒక్క దానికేనా?' ఊహకందని వేదనతో హృదయం కదిలిపోయింది. 'ఏమైంది అతనికి? ఈ రోజంతా విలపిస్తూనే ఉన్నాడలా. ఎందుకని? భగవాన్! అతని కేం చేశావు?' ఆ పసి హృదయం తల్లడిల్లిపోయింది. పెనవేసుకు పడుకున్న పిల్లలను తప్పించుకుని పక్కపైనుండి లేచింది సరస్వతి. గది వీడి వచ్చింది. కాని వీధి తలుపు తెరవబోయేటంతలో ఆ ధైర్యమంతా నీరుగారిపోయింది. గడియపై వేసిన చేతుల్లో శక్తి క్షీణించిపోయింది. యోచనాశూన్యమైంది.

'రాలేను, ప్రియతమా, రాలేను! భగవాన్! అతన్ని రక్షించు' అని విలపిస్తూ ఉండిపోయింది.

* * *

తెల్లవారేసరికి ఒక వార్తతో పల్లె పల్లె అంతా అల్లకల్లోలమైపోయింది. "జమీందారు వారి చిన్న రాణీగారి తమ్ముడు సాగర్‌బాబు జమీందారుగారి భవనం వెనక తట్టున ఉన్న దయ్యాల కొలనులో పడి ఆత్మహత్య చేసుకున్నా"డని ఆ వార్త! రేయి ఎప్పుడతను అవకాశం చూసుకుని మేడపైనుండి కొలనులోకి దూకాడో ఎవరూ ఎరగరు. తెల్లారిన తరువాత నౌఖరు వారి గదిలోకి వెళ్ళి చూస్తే లేరట. ఎక్కడికి వెళ్ళారో, ఎలా వెళ్ళారో అని తోటా, భవంతీ అంతా గాలించారు. ఇంటిల్లిపాదీ అలా ఆందోళన పడుతుండగా ఎవరో వచ్చి దయ్యాల కొలనులో ఏదో శవం తేలుతూ ఉందని చెప్పారు. అతనెవరైనదీ ఎవరికీ తెలియదు. ఒకరిద్దరికి తప్ప లోగిలిలో పనిచేసే నౌఖర్లకే అతని రూపురేఖలు తెలియవు. ఆ వార్తతో జమీందారుగారు నౌఖర్లను వెంటపెట్టుకుని కొలను చేరారు. అప్పటికే వార్త పల్లె పల్లె అంతా పాకిపోయింది. దానితో వచ్చిచేరిన జనంతో అక్కడో చిన్న తీర్థంలా తయారయింది.

వీలుచూసుకుని గంగ, యమున ఇంటికి వెళ్ళింది. ఇద్దరూ కూడబలుక్కుని సరస్వతి ఇంటికి వెళ్ళి అక్కడనుండి ముగ్గురూ కలిసి కొలను దగ్గరకు వెళ్ళారు. శవాన్ని పైకి తీస్తున్నారు. దరిదాపుల ఎవరినీ నిలవనీయడం లేదు. ఎవరికీ కనిపించకుండా మొగలి డొంక చాటున చేరి చూడసాగారు గంగా యమునా సరస్వతులు. శవం గట్టుపై ఉంచబడింది. ఈ ఆరు నేత్రాలూ ఆత్రంగా చూశాయి దాన్ని. అంతే. మరునిమిషం ఆ మూడు దేహాలూ ఒకే స్థితిగా స్తంభించిపోయాయి. ఆ శవం ఎలా ఉందని! శవానికి రెండు పాదాలూ లేవు. మోకాళ్ళవరకు రెండు కాళ్ళకూ కట్లుకట్టి ఉన్నాయి. పెద్ద పెద్ద మచ్చలతో ముఖం అతి వికృతంగా ఉంది. పడుచుల హృదయాలు పగిలి ఛిన్నాభిన్నమైపోయాయి. పరుగున తోట చేరుకున్నారు. ఓ చెట్టు మొదట కూలబడి ఒకరిపై ఒకరు పడి భోరున ఏడ్వసాగారు.

ఒకప్పుడు అపురూప సుందరుడే అతను. అదృష్టవంతుడు కూడా. కానీ, విధి ఆ అదృష్టానికి అడ్డగీత గీసింది. ఒక ప్రమాదంలో అతని గతే మారిపోయింది. రూపం వికృతమైంది. పాదాలు రెండూ తొలగించబడ్డాయి. కాళ్ళ సంగతి చెప్పలేము. అతుక్కుంటే అతుక్కుంటాయి. లేకపోతే అవీ తొలగించాలి. అంతకంటే ఇంకేం చేయలేకపోయింది వైద్య

(తరువాయి 18 వ పేజీలో)



దారులు

ఫోటో—జి. వి. సత్యనారాయణరావు (హైదరాబాదు-5)

# సంగమం

(౪ వ పేజీ తరువాయి)

శాస్త్రం. ఇక అతనికి కావలసింది విశ్రాంతి. ఆ తర్వాతే ఏ స్వస్థత అయినా. అందుకే ఇక్కడికి వచ్చాడు. ఈ విషయా లేవీ ఎవరికీ తెలియవు. ఎందుకనో జమీందారుగారు ఇదంతా వెల్లడి కాకుండా కట్టుదిట్టం చేశారు.

అతను జమీందారుగారి బంధువు. వారి తర్వాత ఆ జమీకి కాబోయే జమీందా రతనే. ఏదో జబ్బుగా ఉంది. విశ్రాంతికై వచ్చా డక్కడకు. అతని పేరు సాగర్. శిలలు కూడా కరిగిపోయేలా పాడతాడు—ఎవరికైనా తెలిసిన వివరాలు ఇవి మాత్రమే.

విశ్రాంతికోసం వచ్చా డత డక్కడకు. కానీ, ఏం శాంతి పొందగలిగా డతను? ప్రకృతి, శరీరా న్నైనతే స్వస్థపరచగలదు కానీ, హృదయాన్ని ప్రశాంతపరచడం అంతతేలికా? ఆనంద మయమైన బతుకు ఒక్కసారి అతి దుర్భరమై పోయింది. ప్రేమించిన వ్యక్తికీ భారమయ్యాడు. స్మృతికీ దూరమయ్యాడు. ఆశ శూన్యమైంది. భావి హేయమైంది. అటు శరీరానికీ, ఇటు హృదయానికీ ఏర్పడ్డ రుగ్మతకు తట్టుకోలేక విరక్తిచెంది, మేడ కిటికీలోనుండి దూకి కొల నులో పడి విముక్తి నొందాడు. అది మామూలు కొలను కాదు—దయ్యాల కొలను! ముప్ఫయ్యేళ్ళ నాటిది. జమీందారుగారి పూర్వు లెవరో తవ్విం చారు. వేసవిలో కూడా నిండుగా ఉంటుందది. నీళ్ళు తేటగా, కమ్మగా ఉంటాయి. అన్ని పను లకూ పల్లీయులా నీటినే వాడేవారు, గత సంవత్సరంవరకు. సంవత్సరం కిందట అదే రోజు ఒక సంఘటన జరిగింది. జమీందారుగారి నౌక రొకడు పొరపాటున కొలనులో జారిపడి మరణించడం జరిగింది. కొలనులోని నీరు వాడటం మానేశారు. అంతటితో పోలేదు. ఆ మరణించిన వ్యక్తి దయ్యమై ఆ పరిసరాల్లో తిరుగుతున్నాడనీ, ఆ ఛాయలకు వెళ్ళేవారిని బెదిరిస్తూ కష్టాలపాలు చేస్తున్నాడనీ వదంతి. ఆ ఛాయల కెవరూ పోరాదనీ, పశువులను కూడా వెళ్ళనివ్వరాదనీ తీర్మానించుకున్నారు పల్లీయులు. కొలను పూడ్చి వేయవలసిందని జమీందారుగారికి విన్నపమూ చేసుకున్నారు. కానీ, జమీందారుగారు ఆ విన్నపాలను మన్నించలేదు. వదంతి కోసం పెద్దల స్మృతి చిహ్నాన్ని పూడ్చడం అవివేకమని తోసిపుచ్చారు. "దానివలన ఎవరికీ నష్టంలేదు. ఉండదు. చెప్పుకున్నంతగా ఎవరికీ చేటు కూడా కలగలేదు. వాడకపోతే పోనీ— అలాగే ఉండనీయండి" అన్నారు. ఆత్మహత్య లకు పాల్పడేవారి కదే శరణ్యమయింది తర్వాత తర్వాత.

* * *

సంధ్యా సమయమైంది. కడవలు చేతబట్టి బావికి బయలుదేరారు పడుచులు ముగ్గురూ. నడక మందంగా సాగుతున్నది. ఏ [illegible] ముఖంలోనూ కళ లేదు. ఏ పెదవులా దరహాస రేఖలు విరియడంలేదు. ఖాళీ కుండలపై ఏ చేతి వేళ్ళూ చిలిపిగా లయగావించడంలేదు. ముగ్గురి ముఖాలూ మ్లానమై ఉన్నాయి. బావి చేరారు.

తోటలోకి, ఆ మేడపైకి చూసి నిట్టూర్పు విడిచింది సరస్వతి. గంగా యమునలు అటు చూడనేలేదు.

బావిలోనికి కడవను దింపుతూ కన్నీరు నింపింది గంగ. బావిలోనుంచి కడవను చేదుతూ కన్నీరు పిడిబిడి యమున.

"గంగా స్రవంతియై నీ రూపమూ
యమునా నదియై నీ మనసూ
శారదా స్రవంతియై నీ ప్రేమా
సంగమమయ్యేను నా అంతరంగమున
పొంగి పొరలే ప్రణయ తరంగముల!"

పవన వీచికలలో సుళ్ళు తిరిగింది ఆ పాట.

'అమ్మా, గంగా! ఇదే చివరి చూపు. ఇక నేను రాను, రాలేను' అనుకున్నది సరస్వతి, వంగి కడవ నందుకుని గట్టుమీద ఉంచుతూ.

కడవలు అక్కడే ఉంచి తోటలోకి వెళ్ళారు ముగ్గురూ. సర్వం శూన్యమైంది. గాన లహ రులులేక పవనం తేలికయింది. ప్రకృతే మూగవోయింది. పరిసరాలే చిన్నవోయాయి.

గులాబ్ జామచెట్టు విరగ గాసింది. ఒక పండుపై చేయివేసింది యమున. మరో పండుపై చేయివేసింది సరస్వతి. తెంచబోయే టంతలో—"ఇద్దరూ తెంచవద్దు. ఒకటి చాలు" అంది గంగ. యమున గంగ ముఖంలోకి చూసి, ఫలంపై చేయి తీసేసింది. పండు తెంచింది సరస్వతి. తెచ్చి గంగకిచ్చింది. గంగ దాన్ని మూడు భాగాలు చేసింది. ముగ్గురూ తిన్నారు. పిక్కలు చేత బట్టుకుని ఆ మేడ ప్రహరీ గోడకేసి వెళ్ళింది గంగ. చెలు లిద్దరూ అనుసరించా రామెను. పైనున్న కిటికీకి దిగువగా, గోడ కీవల చిన్న గోయితీసి, అందులో ఆ గింజలను ఉంచి మన్నుపోసి పూడ్చింది గంగ. యమున దోసిలితో నీళ్ళు తెచ్చి దానిపై పోసింది. సరస్వతీ అలానే చేసింది. చివరకు గంగా అలా చేసిన తర్వాత ముగ్గురూ తిరుగుదారి పట్టారు.

* * *

నడి రేయి. అదీ అమావాస్య రేయి. దరి దాపుల్లో వెలుగునోచని గాఢాంధకారం.

"నీవె రావలె ప్రియతమా!"

పక్కపైనుండి లేచింది గంగ. పైట వోణిని ముసుగుగా సవరించుకుంది. సద్దు చేయక మెల్లగా ఇల్లువీడి ఆ చీకట్లో ఎటో సాగిపోయింది. మరి రెండు చోట్లా అలానే జరి గింది.

ఇలువీడిన ఆ ముచ్చురు మూర్తులూ దయ్యాల కొలను చేరారు. అక్కడే ముచ్చురూ ఒకరి నొకరు గుర్తించారు. చివరి కొకటిగా అయ్యారు. యమున వాలుజడ గంగ వాలుజడతో ముడిపెట్టబడింది. ఆ ముడిలో సరస్వతి సుదీర్ఘ కేశరాశి కూడా ఇముడ్చబడింది. మధ్య నున్నది యమున. ఎడమ చేయి గంగ నడు మును చుట్టింది. కుడిచేయిలో సరస్వతి నడుము. అర కన లూ [illegible]కధారగా అశ్రువులను స్రవిస్తున్నాయి. మూడు హృదయాలూ ఒకే భావంతో రోదిస్తున్నాయి. ఒక్కటైన సంక ల్పమూ ఏదో నిశ్చయానికి తొందర చేయ సాగింది. కొలనులోకి దిగారు. చివరి పావం చాపై నిలిచారు.

"అమ్మా, గంగా! మరు జన్మలో మా ముగ్గు రినీ ఒకే మనిషిగా పుట్టించు. కోరిన కోరిక ఒక్కటైనా తీరేలా చూడు—" గంగ కోరింది. యమున కోరింది. సరస్వతి కోరిందీ అదే. కోరిన కోరిక తీరుస్తా నన్నట్టుగా అలలను లేపి కొలను హామీ ఇచ్చింది.

నేడు ఆ భవంతీ లేదు. కొలనూ లేదు. శిథిలమైంది భవంతి. పూడ్చబడింది కొలను. దయ్యాల కొలనన్న పేరుమాసి, దయ్యాల దిబ్బ అని పేరుమోసింది. వెన్నెల రాత్రులు ఆ పరిసరాలలో ఏవో నాలుగు నీడలు ఆట పాటలతో విహరిస్తుంటాయట. పల్లీయులకు భయం. ఆ దరిదాపులకే ఎవరూ పోరు. తెగువ చేసి ఎవరన్నాపోతే, ఆ ఆటలైతే కనిపించవట గానీ, పాట లేవో వినిపిస్తుంటాయట. కాని వాటి అర్థ మెవరికీ అందదు. అందుకే అవి దయ్యాల కేకలయినాయి.

కానీ, బావికి ఆవల, ఆ శిథిల గృహానికి ఈవల ఒక గులాబ్ జామచెట్టు. పెద్ద చెట్టు. అయినా ఎన్నో కాయలు కాయదట. కాపుకి ఒక్కటి మాత్రమే. అదే చిత్రం. ఆ ఫలం తిన్న వారికి అపురూపమైన సంతానం కలుగుతుం దన్న ప్రతీతి ఉందట. అది ఈనాటికీ నిజ మవుతూనే ఉందట కూడా. అదేవిచిత్రం. కానీ, ఆ చెట్టునాటిన వారెవరో ఎవరూ ఎరుగ రట. సంవత్సరాని కొకమారు ఆ వృక్షానికి పూజ, జాతర జరుగుతాయట. ఎందుకు మరణించారో నేటికీ ఎవరి ఊహకూ అందని ఆ ముచ్చురు మగువల స్మృతి దినంగా మాత్రం ఆనాడుసంబరం జరుగుతుంటుందట. అంతే. ★

## గమనిక

సమీక్షార్థం రెండు ప్రతులు 'ఎడిటర్. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక. ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్. మద్రాసు-2'కు పంపవలసిఉన్నది.

—ఎడిటర్